తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## స్పందన ఫిర్యాదులకు అర్ధవంత పరిష్కారం చూపాలి

### - కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతిరూరల్, మార్చి20 ప్రభాతవార్త:



స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, అర్ధవంతమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 125 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండరామిరెడ్డి, భాస్కర్ నాయుడులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి, ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

## పెద్దశేషునిపై కోదండరాముడు

### -ఉదయం శాస్త్రోక్తంగా గరుడపటం అధిష్టింపు



తిరుపతి,మార్చి 20ప్రభాతవార్త:

తిరుపతిలోని ప్రసిద్ధ కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో సోమవారం రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనసేవ ఊరేగింది. మొదటిరోజు రాత్రి 7గంటలకు ఆలయంలోని వాహనమండపం వద్ద నుంచి స్వామివారు విశేషాలంకారభూషితుడై సీతాలక్ష్మణసమేత కోదండరామస్వామి భక్తుల రామనామస్మరణల మధ్య ఊరేగారు. గజరాజులు కదులుతుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. ఏడులోకాలకు సంకేతంగా ఏడుపడగల ఆదిశేషుడిని వాహనంగా చేసుకుని ఊరేగారు.

**-ఉదయం వేడుకగా ధ్వజారోహణం:**

కోదండరాముని బ్రహ్మోత్సవాలకు సోమవారం ఉదయం 9.20గంటల నుంచి 9.32గంటల మధ్య మేషలగ్నంలో గరుత్మంతుని చిత్రంతో ఉన్న ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చరణలు, భక్తులగోవిందనామస్మరణ, రామనామ జపముల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, విజిఒ మనోహర్, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ మోహన్ ,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# అకాలవర్షం- అపారంనష్టం



శ్రీకాళహస్తి,మార్చి 20 ప్రభాతవార్త

తిరుపతిజిల్లా తూర్పు మండలాల్లో సోమవారం కూడా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాయగా మధ్యాహ్నం నుంచి గాలి వాన, ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. మూడు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలతో జన జీవనం స్థంభించింది. వర్షాకాలంలో కూడా వరుసగా మూడు రోజుల పాటు వర్షాలు కురవ లేదని తుఫాను కారణంగా వర్షాలతో జన జీవనం స్థంబించిందన్నారు. నష్టాలు కూడా అపారంగా ఉన్నాయని వివరించారు. శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరు ఒబ్బిళ్ళు జరిగాయి. అయితే పండించిన పంటను నిల్వ చేసుకునే గాదులు నేడు రైతుల ఇళ్ళలో లేదు. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల పని తీరు ప్రశ్నార్థకంగా మారింది. మిల్లర్లు కొనుగోలు చేయాలంటే కారుచౌకగా అడుగుతున్నారు.మార్కెటింగ్ కమిటి గోదాముల్లో నిల్వ చేసుకొని రుణం పొందే అవకాశాల్లేక ఇబ్బంది పడుతున్నారు.దాంతో నాలుగైదు రోజులుగా ఒబ్బిళ్ళు చేసిన ధాన్యం రోడ్ల మీద వేసుకున్నారు. దళారులు వచ్చి మూటలు కట్టుకోవాల్సి ఉంది. అయితే మూడు రోజులుగా అకాల వర్షాలతో వాహనాలు గ్రామాల్లోకి వచ్చే పరిస్థితి లేదు. దాంతో రోడ్లమీదనే ధాన్యం కుప్పలు పోసి పట్టలు కప్పి ప్రతి రోజూ ఆకాశం వైపు బిత్తర చూపులు చూస్తున్నారు. వర్షం నిలుస్తుందా? అని ఎదురుచూస్తున్నారు.అధికారికంగా అందించిన సమాచారం మేరకు సుమారు 5వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని అధికారులు అంచనా వేసారు.

**విద్యుత్‌శాఖకు అపార నష్టం:**

మూడు రోజుల అకాల వర్షాలు విద్యుత్ శాఖకు అపార నష్టం కల్గించినట్లు విద్యుత్‌శాఖ ప్రకటించింది. సోమవారం మధ్యాహ్నం హఠాత్తుగా ఉరుములు మెరుపులు, వడగండ్ల వాన కురిసింది. గత 40సంవత్సరాలుగా లేని విధంగా మళ్ళీ వడగండ్ల వానను చూసామని వృద్దులు చెబుతున్నారు.శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌డివిజన్‌లో వివిధ గ్రామాలకు చెందిన 15కిలో మీటర్ల మేర విద్యుత్ కేబుల్ మరియు తీగలు, 114 విద్యుత్ స్థంభాలు 78ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని వీటి విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుందని అంచనా కట్టారు.

## తొట్టంబేడు మండలంలో 300 ఎకరాల్లో పంటనష్టం

### విద్యుత్‌షాక్‌తో రెండు ఆవులు మృతి

తొట్టంబేడు, మార్చి 20 ప్రభాతవార్త

అకాలవర్షం అన్నదాతలకు తీవ్రనష్టం కలిగించింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకారణంగా మండలంలో చేతికి వచ్చే వరి పంట నేలకొరిగింది. మరో వారం రోజుల్లో చేతికి వస్తుందన్న వరిపంట వర్షాలకారణంగా వరి, మరియు వేరుశనగ పంటలకు కలిగింది. ఈనేపద్యంలో మండలంలోని లింగమనాయుడుపల్లి గ్రామంలో 50 ఎకరాలు, పెద్దకనపర్తిలో 6 ఎకరాలు, శివనాథపాళెంలో 42ఎకరాలు, కొత్తకండ్రిగలో 5ఎకరాలతోపాటు చియ్యవరంలో 152 ఎకరాల్లో వేరుశనగ పంటకు తీవ్రనష్టం కలిగింది. అయితే వేరుశనగ పంటకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొంటున్నా అన్నదాతలు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చియ్యవరంలో 50 ఎకరాల్లో వేరుశనగ పంటకు నష్టం వాటిల్లింది. తొట్టంబేడు మండలంలో ఆదివారం 31.4మి.మీ వర్షపాతం నమోదవగా, ఆదివారం మద్యాహ్నం ఉరుములు,



మెరుపులతో కూడిన వర్షం పడింది. సోమవారం మండలంలో 30.0మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం మండలంలోని పెద్దకనపర్తి గ్రామానికి చెందిన సురేష్‌కు ఉన్న రెండు ఆవులువిద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాయి.

## నేడు కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

### -రేపు ఉగాది ఆస్థానం



తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో (రేపు) బుధవారం తెలుగు నూతన "శోభకృత్ నామ సంవత్సర"ఉగాది పర్వదిన ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కోయిల్‌ఆళ్వార్‌తిరుమంజనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి 11గంటల వరకు ఈ కార్యక్రమం మహాయజ్ఞంలా చేపడతారు. అనంతరం సర్వదర్శనం మొదలవుతుంది.

**-రేపు ఉగాది ఆస్థానం:**

రేపు ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమాన ప్రాకారం,ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు.

## ఉరి వేసుకొంటానని బెదిరిస్తూ ...

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:



ఆత్మహత్య చేసుకొన్న లోకేష్.

ఫైనాన్స్‌లో కట్టాల్సిన డబ్బులను చెల్లించాలని లేకుంటే తాను ఇక్కడ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంటానని బెదిరిస్తూ ఉరి వేసుకోవడానికి అంత రంగం సిద్ధం చేసి ఫోన్‌లో వీడియో కాల్ చేసి చూపుతూ నిజంగా ఉరి వేసుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చిత్తూరు పట్రంపల్లి కాలనీలో చోటు చేసుకొంది. తమిళనాడు రాష్ట్రం తిరపత్తూరుకు చెందిన లోకేష్ మేస్త్రీ పనులు చేసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మేస్త్రీ పనులు చేయడానికి కొంతకాలం క్రితం చిత్తూరు పట్రంపల్లి కాలనీలోని ఇల్లు తీసుకొని ఇక్కడే పనులు చేసుకొంటున్నాడు. ఈక్రమంలో లోకేష్ తిరపత్తూరులో కొన్ని నెలల క్రితం ఫైనాన్స్‌లో ఒక ద్విచక్రవాహనం కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించిన వాయిదాలు ఫైనాన్స్‌కు సకాలంలో చెల్లించకపోవడంతో ఫైనాన్స్ వ్యక్తులు లోకేష్ వాళ్ళ మామ ఇంటికి వెళ్ళి నిలదీయడం ప్రారంభించారు. ఈ మేరకు లోకేష్ మామ లోకేష్‌కు ఫోన్ చేసి తమ ఇంటి వద్దకు ఫైనాన్స్ వారు వచ్చి వేధిస్తున్నారని, డబ్బులు సకాలంలో చెల్లించాలని చెప్పాడు. అయితే తనకు సంపాదన సక్రమంగా లేకపోవడంతో ఫైనాన్స్ డ్యూలు సక్రమంగా చెల్లిచడం లేదని ఈ ఫైనాన్స్ వాయిదాలను మీరే చెల్లించాలని లేకుంటే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంటానని లోకేష్ తన మామకు హెచ్చరిస్తూ ఉరి వేసుకొనేలా యాక్షన్ చేశాడు. అయితే లోకేష్ నిజంగానే ఉరిలో చిక్కి ప్రాణాలు వదిలాడు. సమాచారం టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్‌కు అందడంతో ఈ మేరకు ఆయన సిబ్బందితో వెళ్ళి లోకేష్ మృతదేహంను కిందికి దించి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ మల్లికార్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అతివేగం ప్రాణాలు తీసింది

### - ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో రోడ్డు ప్రమాదం
### - మృతులు నెల్లూరు జిల్లా కలువాయి వాసులు



పన్నంగాడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులు

తడ, మార్చి 20 ప్రభాతవార్త

జాతీయ రహదారిపై అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు తీసింది. సోమవారం ఉదయం తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం పన్నంగాడు వద్ద మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. డివైడర్‌ను వేగంగా ఢీకొనడంతో ఇద్దరి తలలు బలంగా తాకి రక్తపు మడుగులో చిక్కుకుపోయారు. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. సంఘటన స్థలంలోనే వీరిరువురూ ప్రాణాలు కోల్పోయారు. కలువాయికి రెండు కిలోమీటర్ల దూరంలోని నూకలపల్లె గ్రామానికి చెందిన దండు వెంకటరమణ (23)తో పాటు యలకచర్ల అరుణ్ (26)లు ఈ ప్రమాదంలో ప్రాణాలో కోల్పోయారు. వీరిలో వెంకటరమణ అవివాహితుడు కాగా, అరుణ్‌కు ఏడాది క్రితమే అనూషతో వివాహమైంది. చెన్నైలో ఒక సెల్‌ఫోన్ కంపెనీలో పనిచేస్తున్న అరుణ్ అక్కడే హౌస్‌కీపింగ్ పనిలో ఉన్న వెంకటరమణతో పాటు సోమవారం ఉదయం మోటారుసైకిల్‌లో చెన్నైకి బయలుదేరారు. అరుణ్ భార్య అనూష గర్భవతి కావడం వల్ల కొన్ని మెడిసిన్ రిపోర్టులు తీసుకొని వెళుతున్నట్లు చెప్తున్నారు. వీరిద్దరు గూడూరులో కలుసుకొని అనంతరం మోటారుసైకిల్‌పై అంతదూరం ప్రయాణిస్తూ ప్రమాదంలో పడ్డారు. తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి కలువాయికి సమాచారం అందించడంతో వారి బంధువులు కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం శవాలను తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటమిని జీర్ణించుకోలేకే టిడిపి ఎమ్మెల్యేలపై దాడి

### -మాజీ మంత్రి అమరనాథరెడ్డి



పలమనేరు,మార్చి 20,ప్రభాతవార్త:

ఓటమిని జీర్ణించుకోలేకే టిడిపి ఎమ్మెల్యేలపై వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో దాడులు చేశారని రాష్ట్ర చరిత్రలో ఇదొక బ్లాక్ డే అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.టిడిపి ఎమ్మెల్యే డా.డోలాబాల వీరాంజనేయ స్వామి,సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై వైకాపా ఎమ్మెల్యే అసెంబ్లీలో దాడిని ఆయన ఖండించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలపై అధికార వైకాపా ఎమ్మెల్యేలు గుండాలలాగా దాడి చయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకమని తెలిపారు.దేవాలయం లాంటిశాసన సభలోనే ఇలాంటి దాడి జరగడం వైకాపా ఫ్యాక్షన్ దుశ్చర్యలకు నిదర్శనమని తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి శాసనసభ రికార్డింగ్ దృశ్యాలు వెంటనే విడుదల చేసి దాడికి పాల్పడిన వైసిపి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ఇలాంటి ఘటనలు గొడ్డలి పెట్టులా నిలుస్తాయని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## నిధుల విడుదలపై
## ఎంపీ గల్లా జయదేవ్ హర్షం



రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త:

సికింద్రాబాద్, నంద్యాల, విజయవాడ, తెనాలి నాలుగు వైపుల నుంచి గుంటూరు జంక్షన్ నుంచి ట్రాఫిక్‌ను ఎదుర్కోవడానికి ప్రస్తుతం ఉన్న అడ్డంకులను నివారించడానికి గుంటూరు రైల్వేస్టేషన్ పునర్నిర్మించడానికి ఆత్మ నిర్భర్ అభయన్ పథకం ద్వారా 125 కోట్లు మంజూరు చేసినందుకు గుంటూరు ప్రజల తరపున కృతజ్ఞతలు కేంద్ర ప్రభుత్వానికి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఎంపీ గల్లా జయదేవ్ ధన్యవాదాలు తెలిపారు. 2022-23 సంవత్సరానికి కేంద్రం మంజూరు చేసిన నిధులకు అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్, రైళ్ళ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా 24 గంటలు రైలు రాకపోకలు సాగించడానికి, రైల్వే ప్లాట్‌ఫాం అభివృద్ధి కోసం నిధులు అవసరమవుతాయని తెలిపారు. గుంటూరు రైల్వేస్టేషన్‌తో పాటు మంగళగిరి స్టేషన్ అభివృద్ధి కోసం ఆర్థిక మంత్రి తీసుకున్న నిర్ణయాన్ని శ్రీలక్ష్మి నరసింహస్వామి భక్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గుంటూరు పరిసర ప్రాంతాల ప్రజలు సౌకర్యాలకు ఉపయోగపడేలా నిర్ణీత కాల వ్యవధిలో పనులను పూర్తి చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు.



చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.

## ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

### -23 దుంగలతో పాటు కారు,మోటార్ సైకిల్ స్వాధీనం



తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 20 ప్రభాతవార్త:


కడప జిల్లా పోరుమామిళ్ల అటవీ రేంజ్‌లో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు,ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు.వారి నుండి కారు,ఓ మోటార్ సైకిలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.టాస్క్ ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ రాఘవేంద్ర టీమ్ పోరుమామిళ్ల అటవీ రేంజ్‌లోని టేకూరుపేట మీదుగా కలవకుంట్ల ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు.సోమవారం ఉదయం కొమ్మినేని రాస్తా ఎడమ వైపు ఒక కారు,మోటార్ సైకిల్ నిలిపి ఉన్నారు.అనుమానం వచ్చిన పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా,కారులో దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు.దీంతో అప్రమత్తమై చుట్టుముట్టే ప్రయత్నం చేయగా,దుంగలను పడేసి పారిపోయారు.అయితే అందులో ఐదుగురిని పట్టుకోగలిగారు.పట్టుబడిన వారిలో పోరుమామిళ్ల టౌన్‌కు చెందిన పాలగిరి నాగార్జున(32),పెద్దేటి నాగరాజు(35), గుజ్జుల వెంకటేశ్వర్లు(42),చినమల వెంకటయ్య(62), పులివెందులకు చెందిన నీరెద్దుల ప్రకాష్(20లు ఉన్నారు.వారి నుండి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయగా,సిఐ బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

### ఉష్ణోగ్రతలు
20/3/2023



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- కుప్పం 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 31 డిగ్రీలు

### బంగారం ధరలు
20/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,580

24క్యారెట్స్ 1గ్రాము రూ.6,087

### కోడిగ్రుడ్ల ధరలు
20/3/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిటకిట



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

### మృత్యుంజయ అభిషేకాలు

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు.కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం,మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.

**నిత్యకళ్యాణంకు విశేష స్పందన:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశిస్తే ఎనలేని మధురానుభూతి కల్గుతుంది.ఇక్కడి ఆలయ నిర్మాణామో స్వామి అమ్మవార్ల మహత్యమో కాని ఆలయంలోని కంచుగడప దాటితే ఇక బయటి ప్రపంచం గుర్తుకురాదు. ఆద్మాత్మిక చింతక కల్గుతుంది. ఇక ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యకళ్యాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది.గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమూలు నిర్వహించారు.

**మృత్యుంజయునికి షోడషాభిషేకాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారంప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు.ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు.ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు.ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు,గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప,దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## వేలంపాటలతో 22లక్షల ఆదాయం


శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త



కెనమాకులపల్లి పంచాయతీ బడుగుమా కులపల్లి వారపు సంత, ఇతర గుత్తేల వేలం పాటలతో పంచాయతీకి 22లక్షల ఆదాయం లభించింది. సోమవారం ఇఒపిఆర్డి విజయ్‌దత్, సర్పంచ్ ఎవి జయరాం, కార్యదర్శి రవినాయక్, అశ్వత్ నారాయణల నేతృత్వంలో వేలం పాటలు నిర్వహించారు. కోళ్ల, గొర్రెలు, మేకల సంత ద్వారా 5.13లక్షలు, ప్రైవేట్ వాహనాలతో 4.63లక్షలు, అంగళ్ల సంతతో 5.55లక్షలు, ఎద్దులసంతతో 6.89లక్షల ఆదాయం లభించిందన్నారు.

## దేశం ఎమ్మెల్యేలపై దాడి రాష్ట్ర చరిత్రలో బ్లాక్‌డే

శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త



ప్రతిపక్ష తెదేపా ఎమ్మెల్యేలపై వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో దాడి చేయడం రాష్ట్ర చరిత్రలో బ్లాక్‌డే అని మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీలో ఈ ఘటన జరగడం దారుణమన్నారు. తెదేపా ఎమ్మెల్యేలు వీరాంజనేయస్వామి, గోర ఒట్ల బుచ్చయ్య చౌదరిలపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులను గెలిపించడం తట్టుకోలేక వైకాపా ఎమ్మెల్యేలు ఇలా దాడులకు దిగబడడం దారుణమన్నారు.

## ఆలయ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త

కుప్పంలోని శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ అభివృద్ధిని అడ్డుకునేలా కొందరు ప్రయత్నించడం తగదని ఆలయ చైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం ప్రారంభించకముందే ఆటోలో ప్రచారం చేసి బాలాలయం పూజలు నిర్వహించి రెండు రోజుల పాటు ఆలయంలో వేదపండితులతో అమ్మవారికి ఆవాహనం చేయించిన అనంతరం ఆలయ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. నూతనంగా రాతి స్తంభాల నిర్మాణాలు చేపడుతుంటే కొంతమంది కావాలని అడ్డుకోవాలని నిర్మాణ పనులను వ్యతిరేకించి మాట్లాడడం సబబు కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంకు సహకరించాలని కోరారు.

## టీడీపీ ఎమ్మెల్యేలపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలి

తవణంపల్లె, మార్చి 20 ప్రభాతవార్త:




అసెంబ్లీలో వైకాపాకు చెందిన దళిత ఎమ్మెల్యే దాడికి పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మండలంలోని ఫైమాఘం వైకాపా కన్వీనర్ టి.ప్రశాంత్‌కుమార్ డిమాండు చేశారు. రాష్ట్ర శాసనసభలో వైకాపాకు చెందిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు దుర్భాలాడుతూ దాడికి పాల్పడటంపై ప్రశాంత్ కుమార్ బ్లాక్‌డేను పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యేల చర్యలు యావత్ దళిత జాతిని అవమానించినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకుల ప్రవర్తన ఇలాగే వుంటే అసెంబ్లీ నుండే కాకుండా ఏకంగా రాబోయే ఎన్నికల్లో రాష్ట్రం నుండి శాశ్వతంగా ప్రజలే సస్పెండ్ చేస్తారని ఆయన హెచ్చరించారు.

## పోలీస్ స్పందనకు 22 సమస్యలు

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు జిల్లా పాత డిపిఒ కార్యాలయంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం ప్రజల నుండి 22 సమస్యలు అందాయి. స్పందన కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ అర్జీలను పరిశీలించి సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీటింగ్ 2, వరకట్న వేధింపులు 1, కుటుంబ తగాదాలు 4, ఆస్తి తగాదాలు 2, భూ తగాదాలు 2, మోటర్ సైకిల్ దొంగతనాలపై 2 అర్జీలు అందాయి.

## తెదేపా ఎమ్మెల్యేలపై దాడులు దారుణం - దేశం నేతలు

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త



శాసనసభలో సోమవారం తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యే డా॥ బాల వీరాంజనేయస్వామిపైన వైకాపా ఎమ్మెల్యేలు చేసిన దాడి దారుణమని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ తదితరులు పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ ం పై జరిగిన దాడి అని పేర్కొన్నారు. 2019లో గెలిచిన అనంతరం డా॥ సుధాకర్‌ను చంపడం, డా॥ అనితను హింసించడం,జడ్జి రామకృష్ణను సస్పెండ్ చేయడం వంటి సంఘటనలు దళితుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే వైకాపా ఎమ్మెల్యేలను రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి మునస్వామి, గుడుపల్లె అధ్యక్షుడు బాబు, కౌన్సిలర్లు సురేష్, దాము, సెల్వరాజ్, జాకీర్, సోమశేఖర్, వేలు, మురుగేష్, వినయ్, శారదమ్మ, కాణిపాకం వెంకటేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తగదు

- చంద్రబాబు కార్యదర్శి మనోహర్ - చక్కగా ఉన్న ఆలయాన్ని అభివృద్ధి పేరిట కూల్చుతారా..?

కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త



జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని కూల్చి నేడు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తగదని చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక దేశం నేతలతో కలిసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. గత తెదేపా హయాంలో అమ్మవారి పేరిట నగదును ఎఫ్‌డిలు చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం పెద్ద షెడ్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అలాగే అగ్నిగుండంకు విశాలమైన స్థలంను పాత పోలీస్ క్వార్టర్స్‌ను తొలగించి కేటాయించడం జరిగిందన్నారు. ఆ సమయంలో కూడా ఆలయ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుని ఆలయాన్ని భక్తులకు అనుగుణంగా ఉండేలా చేశామన్నారు. నేడు వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక గతేడాది అమ్మవారి ఆలయంను పునర్నిర్మిస్తామని పేర్కొంటూ ఉన్న ఆలయంను కూల్చివేశారన్నారు. రోడ్డు పక్కనే అమ్మవారి గర్భగుడిని ఇష్టారాజ్యంగా వదిలేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది అమ్మవారి జాతరకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇంతవరకు తెలియడం లేదన్నారు. కార్యక్రమంలో నేతలు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, శాంతారాం, మంజునాథ్, ఆర్ముగం, ఆర్ఆర్ రవి, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, జాకీర్, జిమ్‌దాము, వేలు, చలపతి, సుధాకర్, వేణు, గిరి, యశోదమ్మ, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త

చెన్నై- బెంగళూరురైలు మార్గంలో కుప్పం రైల్వే స్టేషన్ సమీపం లోని శ్రీ పెద్దపులి గంగమ్మ ఆలయంకు కూతవేటు దూరంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడికి సుమారు 55 ఏళ్లవయసుఉంటుందనితెలుపుగళ్ల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడినిగుర్తించినవారుకుప్పం రైల్వే పోలీసులను9494 228854,9440627652 నెంబర్లకు సంప్రదిం చాలని కోరారు.

## సిఎం వైఎస్ జగన్‌ను కలసిన రెస్కో చైర్మన్ సెంధిల్‌కుమార్

కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కుప్పం రెస్కో చైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ లాబీల్లో ముఖ్యమంత్రిని కలిశారు. ఈసందర్భంగా కుప్పం రెస్కో పరిధిలో రైతులసౌకర్యార్థం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. రెస్కో అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరగా సిఎం సానుకూలంగా స్పందించారు.

## అప్రెంటిషిప్ మేళాలో 35మంది ఎంపిక

శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా విజయవంతమైందని ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. 35మంది విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనగా వీరిని స్వాం అల్లాయ్స్ సంస్థ (పాకాల), హోండాయ్ (బెంగళూరు),తిరుపతిఅమ్మఛారిటబుల్ ట్రస్ట్‌కు మ్యాపింగ్ చేయడం జరిగిం దన్నారు. కార్య క్రమంలో పలమనేరు వరుణ్ ప్రైవేట్ ఐటిఐ, నేషనల్ ప్రైవేట్ ఐటిఐ, సాయిపవన్ ఐటిఐ చిత్తూరు, సూరినేని ఐటిఐ బంగారు పాళెం, కళామూర్తి ఐటిఐ కుప్పం వారు పాల్గొన్నారన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు జీర్ణించుకోలేక ఎమ్మెల్యేలపై దాడులు

- జిల్లా తెలుగుదేశం నాయకులు ధ్వజం

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాలను జీర్ణించుకోలేక అధికార వైకాపా ఎమ్మెల్యేలు ప్రతిపక్ష తెలుగుదేశం సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, దళిత ఎమ్మెల్యే డోలా వీరంజనేయ స్వామిపై దాడి చేశారని ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీ సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు పులివర్తినాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌లు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై భౌతిక దాడులకు పాల్పడటంతో రాష్ట్ర చరిత్రలో సోమవారం చీకటి రోజని వారు పేర్కొన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు గుండాలు, వీధి రౌడీల్లా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యంకు తీవ్ర కళంకం తెచ్చిందని వారు ఆరోపించారు. ఈ దాడులను ఖండించిన వారిలోమాజీ మేయర్ కఠారి హేమలత, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు వున్నారు.

## దంతాల పరిశుభ్రతపై అవగాహన

బంగారుపాళ్యం, మార్చి 20 ప్రభాతవార్త:

ప్రపంచ నోటి పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా కీరమంద ప్రాథమికోన్నత పాఠశాలలో అపోలో ఫౌండేషన్ దంతాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెంటల్ బనాగే స్వచ్ఛంధ సంస్థ ఈ కార్యక్రమంను నిర్వహించింది. విద్యార్థులకు నోటిని ఎలా శుభ్రం చేసుకోవాలి, రోజుకు రెండు సార్లు దంతాలకు బ్రెష్ వేయాలని పేర్కొన్నారు. నోటి పరిశుభ్రత వల్ల కలిగే లాభాలకు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు టూత్ బ్రేష్‌లు, పేస్టలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటముని, మస్తానీ, బృంద తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు పూర్తి స్థాయి పరిష్కారం

- కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:



స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలకు పూర్తి స్థాయి పరిష్కారం చూపాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్‌తో కలిసి కమీషనర్ డాక్టర్ జె.అరుణ స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి క్షేత్ర స్థాయికి వెళ్ళి సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని కమీషనర్ ఆదేశించారు.సహాయ కమీషనర్ గోవర్ధన్, ఎంఇ ధనలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అన్నదానంను అడ్డుకొన్న అగ్రకులస్తులపై చర్యలు

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:

కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం జాతీయ రహదారికి సమీపంలో ప్రభుత్వ పరుంబొకు స్థలంలో సేవా భావంతో జెసి వెల్ఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు చేస్తున్న అన్నదానం కార్యక్రమంను అడ్డుకొన్న అగ్రకులస్తులపై చర్యలు తీసుకోవాలని ఫౌండేషన్ నిర్వాహకులు జయప్రకాష్ డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీను నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టామని, పరుంబొకు స్థలంలో నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమంను ఆ స్థలంను కబ్జా చేయాలని భావిస్తున్న కొందరు అగ్రకులస్తులు షామియానాను కూల్చివేశారన్నారు. ఇప్పటికే ప్రతి రోజు 300 మందికి ఇక్కడ అన్నదానం చేస్తున్నామన్నారు. పేదలకు చేస్తున్న అన్నదాన కార్యక్రమంకు ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు సహకారం అందించాలని ఆయన కోరారు.

## వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీలో వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్ఇ గోపాల్‌రెడ్డితో కలిసి డికెపల్లి చెరువు, వీరప్పనాయని చెరువు, పాలారు నది ప్రాంతాలను పరిశీలించారు. డికెపల్లి వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణంకు సాధ్యాసాధ్యాల గురించి పరిశీలించారు. ఇరిగేషన్ ప్రాజెక్టు వివరాలను డిఇ హరినాథ్‌రెడ్డి వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 16,18,19,20వార్డుల్లో ఉన్న రాజుకాలువలపై ఫుట్‌పాత్‌లు నిర్మించడం పట్ల ప్రజలకు కలిగే లాభాలను మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవిరెడ్డి, ఎఇ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 24 నుండి గడప గడపకు మనప్రభుత్వం నిర్వహిస్తా

-నియోజవర్గ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి మార్చి 20 ప్రబాతవార్త



ఈ నెల 24 వ తేది నుండి నియోజక వర్గంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తానని రాష్ట్ర కమ్యూనిటి బోర్డు డవలప్ మెంట్ బోర్డు చైర్మన్,నియోజవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు.సోమవారం నాడు వెంకటగిరి లోని ఆయన నివాస గృహంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంపై అదికారులు,నాయకుల తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భగ ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పదకాలను వివరిస్తా మని తెలిపారు.ఇంకా సమస్యలు తెలిసుకొని పరిష్కరిస్తామని తెలిపారు.మండలాల వారిగ తిరుగు తామని తెలిపారు.సమావేశంలో బాలాయపల్లి ఎంపిపి జి భాస్కరరెడ్డి,మాజి ఆర్‌టిసి చైర్మన్ చెలికం శంకరరెడ్డి,సొసైటి అద్యక్షులు దశరరామిరెడ్డి తదితరులు పాల్గోనా న్నరు.

## నోటిక్యాన్సర్‌పై అవగాహన

చిల్లకూరు మార్చి 20 ప్రభాతవార్త



మండలంలోని ఒడూరు గ్రామ పంచాయితీలో ఏర్పాటు అయివున్న పెన్వర్ రోయ్యల పరిశ్రమలో సోమవారం నోటి క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా చిల్లకూరు ప్రాథమిక వైద్యులు డాక్టర్ మోహన సిబ్బందితో కలిసి పెన్వర్ పరి శ్రమలో పనిచేస్తున్న కారి ్మకులు నోటి క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. వాటి వల్ల తీసుకోవాల్సిన జా గ్రత్తలు వివరించారు.అనంతరం ర్యాలీ నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో ఎన్‌టిసి లలితా,సిహెచ్ఒ సుదీప్ ,ప్రియాంక, సుధీర్‌కుమార్, రమణమ్మ, ఇంద్రజా సుబ్బరత్నమ్మ, రవికుమార్ తదితరులు పాల్గోన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన చీఫ్ ఇంజినీర్


కోట, మార్చి 20, ప్రభాతవార్త



చిన్నకూరు మండలం పల్లమాల నుంచి వాకాడు మండలం తూపిలిపాల్యెం వరకు 22 కిలో మీటర్లు పరిధిలో 18.6 కోట్లతో రోడ్డు పనులను చేపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆ రోడ్డు పనులను ఆర్‌అండ్‌బి క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ రమేష్ కుమార్ ఈ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ శివకుమార్, ఈఈ గీతావాణి, డిఇ అరుణమ్మ, తదితరులు ఉన్నారు.

## అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేపై దాడి పై నిరసన

కోట, మార్చి 20, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా ఉందని కోట మండల తెలుగు దేశం పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. సోమవారంసాయంత్రం కోటలోని ఆ పార్టీ నాయకులు తిరుపతి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహమ్మద్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభలో ఎమ్మెల్యేపై దాడి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. అసెంబ్లీ చిరిత్రలో ఈవాళ్ల చీకటి రోజని సిఎం జగన్ ప్రోద్బలంతోనే దళిత సభ్యుడు దోలా బాల వీరాంజనేయ స్వామిపై దాడి చేసారని ఆరోపించారు. చట్ట సభలకు మచ్చ తెచ్చిన వ్యక్తిగా జగన్‌మోహన్ రెడ్డి నిలిచిపోతారని అన్నారు. వైకాపా సిద్ధాంతం ఏమిటో ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా వుందన్నారు. ఈ నిరసనకోట బిట్ 1, బిట్ 3 ఎంపిటిసిలు దారా సురేష్, సంసుద్దీన్, తీగల సురేష్ బాబు, వెంకనపాల్యెం సర్పంచ్ మధుయాదవ్, నౌషాద్, నాయబ్, బాబు, మోహన్, వంశీ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో నేత్రదానాలు

**సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త** సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు సోమవారం రెండు నేత్రదానాలు అందాయి. స్థానిక గమండ్లవీధి నివాసి కల్లేటి మునుస్వామి, సాయినగర్ నివాసి ఓసూరు మల్లెమ్మలు మృతిచెందారు. వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో వారి కార్నియాలను తీసి భద్రపరిచి చెన్నైలోని శంకర్ నేత్రాలయకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఇది ప్రజాస్వామ్య రాష్ట్రమా లేక రౌడీల రాజ్యమా

- అసెంబ్లీలో దాడులు చేయడం సిగ్గుచేటు
- తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి

గూడూరు, మార్చి 20 ప్రభాతవార్త

వైసీపీకి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని ప్రజలందరూ దుర్మార్గపు పాలనకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు బాలవీరాంజనేయస్వామి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిపైన వైసీపీ ఎమ్మెల్యేల దాడిని ఖండిస్తున్నామన్నారు. సాక్షాత్తు ప్రజా దేవాలయమైన అసెంబ్లీలో వైసీపీ నేతల రౌడీయిజాన్ని ప్రజాస్వామ్యవాదులంతా కూడా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి వైసీపీ ఎమ్మెల్యేలకు రాబోయే రోజుల్లో ప్రజలే ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని కోరారు.

## స్వచ్ఛ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

- మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్

గూడూరు, మార్చి 20 ప్రభాతవార్త



గూడూరు పురపాలక సంఘం పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డులు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గూడూరు పురపాలక సంఘం కమిషనర్ తోట సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్నతరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధికరణ, చెత్త సేకరణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే పద్ధతులు, చెత్తతో కళాకృతుల తయారీ, చెత్తతో సంపద తయారీ, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, తడి చెత్త వినియోగంతో కంపోస్టు తయారీ తదితర విభాగాల్లో వీటిని అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 24 తేదీలోగా గూడూరు పురపాలక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తామన్నారు.

## 25న ఎన్‌బికెఆర్‌లో మిక్సోడియా 2023 సదస్సు

కోట, మార్చి 20 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25న జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ మిక్సోడియా 2023 నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్, పోస్టర్ అండ్ మోడల్ ప్రదర్శన వంటి వివిధ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఆ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లతో పాటు నగదు పురస్కారం అందజేస్తామన్నారు. అనంతరం మెకానికల్ హెచ్ఓడి విక్రమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు సహకారంతో పనిచేసే కిసాన్ డ్రోన్, ఎస్ఎఇ క్లబ్ విద్యార్థులచే రూపొందించబడిన వివిధ వాహనాల నమూనాలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ వై.అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అమర్‌బాబు, డాక్టర్ ఎం.శ్రీనివాసులు, డాక్టర్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ నందకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకన్నపాలెం కార్యదర్శిపై విచారణ

కోట, మార్చి 20 ప్రభాతవార్త



కోట మండలం వెంకన్నపాలెం పంచాయతీ కార్యదర్శిపై సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో డిఎల్‌పిఓ వెంకటరమణ విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఉన్న ఆరోపణలపై విచారణ జరిగింది. ఈ విషయంపై కార్యదర్శి శ్రీలక్ష్మిని 'ప్రభాతవార్త' వివరణ కోరగా, తనపై ఎంపిడిఓ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. తన తల్లి చనిపోతే సెలవు మంజూరుచేయలేదని చెప్పారు. అదే సమయంలో తాను అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. సెలవులో ఉన్నప్పుడు విధులెలా నిర్వహించగలనని తెలిపారు. జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని ఆమె కోరారు.

## నాయుడుపేటలో టీడీపీ నిరసన

నాయుడుపేట, మార్చి 20 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. శాసనసభలో జీవో నంబర్1ని రద్దు చేయాలని కోరిన ఎమ్మెల్యే బాలాంజనేయస్వామిని అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తిచే దాడి చేయించారని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. నాయుడుపేట పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట టీడీపీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య, వెంకయ్యానాయుడు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎన్‌టి రామారావు లాంటి ఎందరో మహనీయులను అందించిన శాసనసభలో ప్రస్తుతం రౌడీపాలన రాజ్యమేలుతోందని అన్నారు. మహిళలు, బలహీన వర్గాలు, ఉద్యోగులపై కూడా దౌర్జన్యాలకు ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరులో మార్పు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాదీవెన విద్యార్థులకు ఓ వరం

- సర్పంచ్ శంకు సుజాత, వైసీపీ నాయకులు శంకు మహేంద్ర


ఓజిలి, మార్చి 20 ప్రభాతవార్త



ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీపడాలని, విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఓజిలి మండలం ముమ్మాయిపాలెం సర్పంచ్ శంకు సుజాత, వైసీపీ నాయకులు శంకు మహేంద్ర అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ నేలపై రాసిన దశ, పుస్తకాలపై పెన్సిల్, పెన్నులతో రాసిన రోజులు పోయి, డిజిటల్ విద్య, కంప్యూటర్ విద్య ప్రస్తుతం నడుస్తోందని అన్నారు. ప్రపంచ స్థాయిలో విద్యార్థులు పోటీపడాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్య కోసం ఇన్ని పథకాలు ప్రవేశపెట్టిన ప్రబుత్వాలు, ముఖ్యమంత్రులు లేరన్నారు. ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యతోనే పేదరికం దూరమవుతుందనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 2023-23 విద్యా సంవత్సరానికి సంబంధించి తల్లుల ఖాతాల్లో బటన్ నొక్కి నగదు జమ చేశారని తెలిపారు. మన రాష్ట్రంలో పేదరికం లేని సమాజం విజ్ఞానవంతులు సమాజంగా మారాలంటే విద్య ఒక్కటే మార్గమని, ముఖ్యమంత్రి జగనన్నకు తెలుసు కాబట్టి మూడు నెలలకు ఒకసారి పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. జగనన్న పేదరికం లేని సమాజం నిర్మించడానికి గొప్ప విజయంతో ముందుకు వెళుతున్నారని తెలిపారు.

## శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు

సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామనవమి వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఛైర్మన్ అయితా శ్రీధర్ సోమ వారం తెలిపారు. 22వ తేదీ బుధవారం శ్రీవైకుంతవాసుల అలంకారం, 23న గురువారం వామన అలంకారం, 24న శుక్రవారం త్రివిక్రమ అలం కారం, 25న శనివారం బలరామ అవతారం, 26న ఆదివారం శ్రీరామ అవతారం, 27న సోమవారం విశ్వామిత్ర యాగ సంరక్షణ అలంకారం, 28న మంగళవారం అహల్య శాపవిమోచన అలంకారం, 29న బుధవారం శ్రీరాధాకృష్ణ అలంకారం, 30న గురువారం శ్రీసీతారామ కల్యాణం, 31న శుక్రవారం శ్రీసీతారాముల పట్టాభిషేకం అలంకారంతో పాటు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శ్రీసీతారామ కల్యాణోత్సవం రోజున వేదపండితులచే శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తిచేశారు.

## సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో సోమవారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. సుమారు రెండుగంటల పాటు కురిసిన వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఉరుములు మెరుపులు ఈదురు గాలులతో వర్షం పడటంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్మశానం వద్దనున్న జిఎన్‌టి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరుకుంది. దీనికితోడు కొత్తగా వేస్తున్న వాటర్‌పైపులైన్ల వల్ల తీసిన గోతులతో వర్షపు నీరు నిండిపోయి కొంతమంది ఈ గోతుల్లో ప్రమాదవశాత్తు పడటం, గాయపడటం జరిగింది. ఈ గోతుల వల్ల ప్రధాన వీధుల్లో రోడ్లన్నీ రొచ్చురొచ్చుగా మారాయి. వర్షంతో డ్రైనేజి నీళ్లతో పాటు వర్షపు నీరు కలిసిపోయి మున్సిపల్ కార్యాలయం, గమండ్లవీధి, ప్రభుత్వ హాస్పిటల్ ఎదురు సందులో మోకాళ్లలోతు నీళ్లు ప్రవహించాయి.

# వేసవిలో ఎండ తీవ్రత, వడగాల్పులు అధికంగా నమోదు కానున్నాయి

## -జిల్లా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలు సూచించాలి -కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, మార్చి20 ప్రభాతవార్త: ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, 48 నుండి 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యే అవకాశం ఉందని, దీనితో పాటు వడగాల్పులు తోడైయ్యే అవకాశం ఉందని, జిల్లా అధికారులు, స్వచ్ఛంధ సంస్థలు, స్వయం సహాయ సంఘాలు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో విపత్తుల నిర్వాహణకు సంబంధించి ఈ ఏడాది నమోదు కానున్న ఎండల తీవ్రత, వడగాల్పులపై చేపట్టాల్సిన ముందుజాగ్రత్తలపై జె.సి. డి.కె.బాలాజీతో కలిసి జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత, వడగాల్పులు నమోదు కానున్న నేపధ్యంలో రెవెన్యూ యంత్రాంగం, జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, పంచాయతీ రాజ్, మునిసిఫల్ శాఖలు మజ్జిగ, పంఫిణీ, చలివేంద్రాల ఏర్పాటు చూడాలన్నారు. ప్రధానంగా ప్రతిరోజు నమోదు కానున్న ఎండతీవ్రత వివరాలు మీడియాకు అందించే ప్రత్యేక కాలమ్ ఏర్పాటుతో ప్రచురించేలా చూడాలన్నారు. స్వచ్ఛంధ సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు సహకారం అందించాలని సూచించారు. గ్రామాల్లో పశువుల కోసం ఏర్పాటు చేసి వున్న వాటర్ టబ్స్‌లో ఎప్పటికప్పుడు నీరు నింపేలా, విద్యుత్ అంతరాయం కలిగితే చేతి పంపులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల పిల్లలకు సంబంధించి త్వరలో నిర్ణయం తీసుకోనున్నదని, ఆ ప్రకారమే పిల్లలు ఇంటికి చేరేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓ ఆర్ ఎస్ ప్యాకేట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని సచివాలయాల్లో వున్న హెల్త్ సెంటర్లలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో పి హెచ్ సిలలో, జిల్లా కేంద్ర ఆసుపత్రులలో కావాల్సిన ఓ ఆర్ ఎస్, ఫ్లూయిడ్స్, మందులు అందుబాటులో ఉంచాల న్నారు. విద్యుత్ శాఖ అన్ని ఆసుపత్రులకు తప్పనిసరిగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వడదెబ్బకు ఏ ఒక్క ప్రాణికి హాని జరగరాదని, అన్నిశాఖల సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి పనులను ఉదయం, సాయంత్రం సమయాల్లో చేపట్టేలా చూడాలని, పనులు జరుగుతున్న ప్రదేశాలలో షెల్టర్స్ ఏర్పాటు చూడాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ప్రత్యేకంగా బస్‌స్టాప్‌ల వద్ద, రద్దీ ప్రాంతాలలో తాత్కలిక గ్రీన్ షేడ్స్ ఏర్పాటు తప్పనిసరి చేయాలన్నారు. స్ట్రీట్ వెండర్స్‌లకు సౌకర్యార్థం వంటివి మునిసిఫల్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. తిరుపతి జిల్లాలోని ప్రజల ఆరోగ్య దృష్ట్యా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు బయట తిరగరాదని, అత్యవసరమైతే అన్ని జాగ్రత్తలు పాటించి బయటకు రావాలని సూచించారు. ఈ సమీక్షలో డిఆర్వో శ్రీనివాసరావు, జిల్లా ఆర్‌డబ్లుఎస్ అధికారి విజయకుమార్, జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, సెక్షన్ సూపరిండెంట్ పరమేశ్వరస్వామి, వైద్య ఆరోగ్యశాఖ ప్రతినిధులు బాలకృష్ణారెడ్డి, రాజారెడ్డి, మార్కెండేయరెడ్డి, సుబ్రమణ్యం, అమరేంద్ర, సుమలతలు పాల్గొన్నారు.

# ఆ విఆర్ఓ చాలా బిజీ..
# స్పందనలకు సైతం డుమ్మా!

## సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి లబ్ధిదారులకు తప్పని తిప్పలు



తిరుపతి రూరల్, మార్చి 20 ప్రభాతవార్త: ఆ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (విఆర్ఓ) తహశీల్దార్‌కు మించి బిజీ .. ఎంత బిజీ అంటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పందన కార్యక్రమాలకు సైతం డుమ్మా కొట్టే అంత బిజీ అని పంచాయతీ ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ సదరు విఆర్ఓ ప్రభుత్వ లక్ష్యాన్ని సైతం నీరుగారుస్తున్నట్లు తనపల్లె, కుంట్రపాకం ప్రజలు వాపోతున్నారు. తిరుపతి కూతవేటు దూరంలో వున్న ఈ గ్రామాల్లో రెవిన్యూ సమస్యలు ఎక్కువగానే వుంటాయి. స్పందన కార్యక్రమంలో పాల్గొని సమస్యను విన్నవించుకుందామని అనుకుంటే గ్రామ రెవిన్యూ అధికారి అందుబాటులో ఉండరు. గత కొన్ని నెలలుగా ప్రతివారం ఇదే తంతు జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా తిరుపతి రూరల్ మండలం, తనపల్లి, కుంట్రపాకం పంచాయతీ ప్రజలకు ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే విఆర్ఓ కోసం లబ్దిదారులు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం కొందరైతే, వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం మరి కొందరు సచివాలయానికి వచ్చి ఖాళీ కుర్చీ వుండడంతో నిస్సహాయ స్థితిలో తిరుగు ముఖం పడాల్సి వస్తోందంటున్నారు. కొందరు రైతులు మాత్రం విఆర్ఓ గొప్పతనాన్ని వ్యంగ్యంగా వివరిస్తూ పాస్ బుక్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే విఆర్ఓనే స్వయంగా ఫోన్ చేసి ఎక్కడున్నారని "అడుగుతున్నట్లు..!" గ్రామస్తులు చెబుతున్నారు. నాలుగు చక్రాల వాహనంలో పంచాయతీకి రావడం ఆ వెంటనే బయలుదేరి వెళ్ళడం విఆర్ఓకు నిత్యకృత్య మైనట్లు సమాచారం. ఎవరైనా వత్తిడి చేస్తే అధికారిక పనుల కోసం అక్కడున్నా, ఇక్కడున్నా అంటూ దాటవేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ ఐడి నూతన విధానంతో కార్యాలయానికి రావలసి వస్తున్నదని, లేదంటే సదరు విఆర్ఓను బూతద్దంలో వెతకాలి వచ్చేదని గ్రామస్తులు చెపుతుండడం గమనార్హం. ఇకనైనా తమ సమస్యల పరిష్కరించడంలో ఉన్నతాధికారులు చొరవ చూపాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ప్రజలకు ఇబ్బంది కల్గించే వ్యాపారులపై చర్యలు తప్పవు

### కమిషనర్ అనుపమ అంజలి



తిరుపతి కార్పొరేషన్, మార్చి 20 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నగర పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు కల్గించేలా వ్యాపారాలు చేస్తున్న వారికి, తోపుడు బండ్ల వారికి తగిన చర్యలు తప్పవని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు పాల్గొని వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా సచివాలయ సిబ్బందితో కమిషనర్ అనుపమ మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యలయంలో ప్రతి సోమవారం వచ్చే పిర్యాదులను స్వీకరించి జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత సచివాలయ సిబ్బందికి అప్పటికప్పుడే పరిశీలన నిమిత్తం ఇవ్వబడుతుందని, అందువల్ల ప్రతి ఒక్క సచివాలయంలో అడ్మిన్ ఆధ్వర్యంలో సెక్రటరీలు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్క సచివాలయంలో సిబ్బంది యూనిఫామ్ ధరించి విధులు నిర్వహించాలని కమిషనర్ అనుపమ అంజలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. తీర్థకట్టవీధిలో తోపుడు బండ్లు అడ్డు కారణంగా వాహనాల పార్కింగ్ చేయడం కష్టంగా వుందని, అదే విధంగా బ్లిస్ హోటల్ ఎదురుగా తాళ్ళపాక అపార్ట్మెంట్ సమీపంలో రోడ్డుపైన అక్రమంగా షాప్ నిర్మించడంతో వాహనదారులకు ఇబ్బందిగా వుందనే వేరువేరు పిర్యాదులపై స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీనివాసం ఎదురుగా ఓపెన్ డ్రైన్ కోసం త్రవ్వేసి పనులు పూర్తి చేయలేదని పిర్యాదులుపై స్పందిస్తూ మరో పదిరోజుల్లో పనులను చేపడుతామన్నారు. మదురానగర్‌లో ఓపెన్ డ్రైన్ బ్లాక్ అయినదని, సుందరయ్య నగర్‌లో మురికి నీరు రోడ్డుపైకి వస్తున్నదని, కేశవాయనగుంట వద్ద యూడిఎన్ బ్లాక్ అవుతున్నదని, రాయల్ నగర్‌లో పెద్ద కాలువని శుభ్రపరచాలనే ఫిర్యాదులపై స్పందిస్తూ త్వరగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా సమస్యలను పరిష్కరించాలని వచ్చిన పిర్యాదుదారులకు హామీ ఇస్తూ వారి సూచించిన ఫిర్యాదులపై తక్షణమే తమ అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపడుతారని కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, దేవిక, గోమతి, మహేష్, శానిటరి సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన మాజి జడ్‌పి చైర్మన్ బొమ్మిరెడ్డి

### -టిడిపి టికెట్‌కు పెరిగిన పోటి



వెంకటగిరి, మార్చి 20 ప్రభాతవార్త : మాజి సిఎం,టిడిపి జాతీయ అద్యక్షులు చంద్రబాబు నాయుడితో మాజి జడ్‌పి చైర్మన్,మాజి ఎంఎల్‌సి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి బేటి అయ్యారు. వెంకటగిరి టిడిపి టికెట్ తనకే ఇవ్వాలని ఆయన బాబును కోరారు.తనకు టిడిపి టికెట్ ఇస్తే తనతోపాటు కొందరు వైసిపి నేతలు తన వెంట వస్తారని మాజి సిఎంకు తెలిపారు.జడ్‌పి చైర్మన్‌గ ఉన్నప్పుడు తనకు వెంకటగిరి నియోజవర్గంతో మంచి సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. ఎంఎల్‌సిగా కూడ తనకు వెంకటగిరి. ఆత్మకూరు నియోజవర్గాల్లో పట్టు ఉన్నట్లు తెలిపారు.నాలుగు సంవత్సరాల నుండి పార్టి కార్యక్రమాల్లో చురుకుగ పాల్గోంటున్నట్లు తెలిపారు.ఆత్మకూరు,వెంకటగిరి నియోజవర్గాల్లో తనకు మంచి సంబందాలు ఉన న్నట్లు వివరించారు.ఇంకా పలు రాజకీయ అంశాలపై చర్చించారు. కాగ ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్దులు ఘనవిజం సాదించడంతో టిడిపి పార్టి టికెట్లకు డిమాండ్ పెరిగింది.మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల నామకృష్ణ తనకే టికెట్ ఇచ్చారని చెపుతున్నారు.ఆయన అన్నా క్యాంటిన్,పార్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.కాగ ప్రముఖ న్యాచురోపతి వైద్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్‌కూడ టిడిపి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన కూడ పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు కూడ పార్టి టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయన సర్వీస్ ట్రస్టుద్వార పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టిడిపి టికెట్‌కు పోటి

## ఉరుములు మెరుపులతో హడలెత్తించిన వర్షం

తడ, మార్చి 20 ప్రభాతవార్త : తడ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం హడలెత్తించింది. గత మూడురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు ఏ మాత్రం తగ్గకపోగా, సోమవారం మరింత ఎక్కువగా కురవడంతో కొన్నిచోట్ల రైతులు నష్టపోయారు. తడలో 10.6 మిమీల వర్షపాతం నమోదైంది. వేసవి పంటలు పుచ్చ, దోస వంటివి ఈ వర్షానికి దెబ్బతిన్నాయి. ఎక్కువ గ్రామాల్లో వరిపంట కోతలు పూర్తయిన కారణంగా రైతులు ఊరట చెందారు. అయితే పంటకోతలు మిగిలిపోయిన గ్రామాల్లో మాత్రం నష్టపోయారు. పొలాల్లో గడ్డిమోపులు వంటివి తడిసి పనికిరాకుండా పోయినట్లు రైతులు పేర్కొన్నారు.



## బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా విద్యాబోధన : జడ్పీ సిఇఓ

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:



ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా విద్యాబోధన చేయాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సదర్భంగా జడ్పీ సిఇఓ తరగతి గదుల్లో విద్యార్థుల వద్దకు వెళ్ళి పలు ప్రశ్నలు వేసి వారి నుండి సమాధానం రప్పించారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పనులు నాణ్యంగా వుండేలా చేయాలని ఆదేశించారు. పనులు త్వరితంగా పూర్తి చేసి తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలఉ రికార్డులను పరిశీలించిన జడ్పీ సిఇఓ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జడ్పీ సిఇఓ నెల్లేపల్లి గ్రామ సచివాలయంను తనిఖీ చేసి సమస్యలపై వచ్చే ప్రజలకు వారి సమస్యలను తెలుసుకొని సత్వరం పరిష్కరించడానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసిన జడ్పీ సిఇఓ అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్షించి విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు కోదండ రామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి, మార్చి 20 ప్రభాతవార్త: స్థానిక కోదండ రామస్వామి వారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు ఏఈఓ పార్థసారధి తెలిపారు. ఈ నెల 29 నుండి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపధ్యంలో ఆలయ శుద్ధి చేపట్టడం సంప్రదాయంగా వస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ గోపురం మొదలుకుని ప్రధాన ద్వారం వరకు ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిలను శుద్ధి జలాలతో శుభ్రం చేయనున్నట్లు తెలిపారు.

## సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే సంజీవయ్య



నాయుడుపేట, మార్చి 20 ప్రభాతవార్త : తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించాలని ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## హమాలీ కూలీలకు పెంచిన అరియర్స్ కూలీలు సత్వరం చెల్లింపు

### - కలెక్టరేట్ ఎదుట హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: పౌరసరఫరాల శాఖ హమాలీ కార్మికులకు చెల్లించాల్సిన ఆరియర్స్ కూలీలను సత్వరం చెల్లించాలని రాష్ట్ర హమాలీ యూనియన్ సహాయ కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. హమాలీ కార్మిలకు సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి రాష్ట్ర హమాలీ యనియన్ సహాయ కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ఆహార భద్రత బిల్లును ఆమోదించి అమలు చేయాలని, స్టేజ్-1 ద్వారా డైరెక్ట్ మూమెంట్ చేయరాదని డిమాండ్ చేశారు. మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్ అన్ లోడింగ్ నిర్వహించే హమాలీ కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు. 2022 దసరాకు ఇవ్వాల్సిన యూనిఫాం ఇప్పటి వరకు ఇవ్వలేదని కార్మికుల సత్వరం యూనిఫాం సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐటియుసి కార్యదర్శి కోదండన్, జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు, జిల్లా హమాలీ యూనియన్ అధ్యక్షుడు అయ్యప్ప, నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా మల్లికార్జునరెడ్డికి డాక్టరేట్ ప్రదానం



కోట, మార్చి 20 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మరియు కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర యువజన వ్యవహారాలశాఖ, క్రీడాభివృద్ధిశాఖ మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్‌ల చేతులమీదుగా పిహెచ్‌డి డిగ్రీ అందుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వ్యాయామ విద్యలో మల్లికార్జునరెడ్డి చేసిన పరిశోధనకు పిహెచ్‌డి అందజేసినట్లు తెలిపారు. మల్లికార్జునరెడ్డిని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## రైలు కింద పడి యువకుడు మృతి

రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త: రేణిగుంట-పుత్తూరు రైల్వే మార్గంలో స్వర్ణముఖి బ్రిడ్జిపై గాజులమండ్యం గురుదేవ(24) రైలు కింద పడి సోమవారం మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ అనిల్ కథనం మేరకు... గాజులమండ్యం చెందిన గురుదేవ్ రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ స్వర్ణముఖి నది బ్రిడ్జిపై చేసుకున్నట్లు తెలిపారు. లోకో ఫైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

## వెంకన్న దర్శనంతో సకలశుభాలు

### -నటుడు మంచు విష్ణు



తిరుమల,మార్చి20 ప్రభాతవార్తప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతోనే సకలశుభాలు కలుగుతాయని నటుడు మంచు విష్ణు తెలిపారు. కుటుంబసభ్యులతో కలసి సోమవారం ఉదయం ఆయన ఉదయం విఐపి బ్రేక్ దర్శనం సమయంలో ఆలయంలోనికి చేరుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


## మామిడిలో నల్లతామర పురుగు



బంగారుపాళ్యం, మార్చి 20 ప్రభాతవార్త: మామిడి పంటలకు నల్లతామర పురుగు ఆశించిందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నలగాంపల్లి, మధుపోలూరు గ్రామాల పరిధిలోని మామిడి తోటలను ఆయన పరిశీలించారు. అధిక మోతాదులో నల్ల తామర పురుగు మామిడి పంటకు ఆశించడం వల్ల దిగుబడి తగ్గే అవకాశం వుందన్నారు. నల్ల తామర పురుగు నివారణకు రైతులు ఆస్పేట్ 1.5 గ్రాము ఒక లీటరు నీటిలో లేదా వేపనూనె 2 ఎంఎల్‌లను ఒక లీటరులో కలిపి చెట్టుకు పిచికారి చేయాలని, మామిడి కాయలు రాలకుండా వుండటానికి ప్లోలోఫిక్స్ ఒక ఎంఎల్ నాలుగు లీటర్ల నీటిలో కలిసి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కీటక నివారణ శాస్త్రవేత్తలు శ్రీనివా సులు రెడ్డి, రాఘవేంద్ర, హెచ్‌ఓ సాగరిక, గ్రామ ఉద్యానవనశాఖ అధికారి కోకిల తదితరులు పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత.. వెంటనే పరిష్కారం

### జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి



తిరుపతి క్రైం, మార్చి 20 ప్రభాతవార్త :

స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత త్వరితగతిన పరిష్కారమని జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి నిర్వహించి ప్రజల నుండి పిర్యాదులు స్వీరించారు. ఎస్పి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 72 మంది వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పి కార్యాలయానికి రాలేని వృధ్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించడం జరుగుతుందని తెలిపారు.

## అన్నమయ్యకీర్తనలతో ఆధ్యాత్మిక చైతన్యం

### -ఆచార్య కొలకలూరి మధుజ్యోతి



తిరుపతి,మార్చి 20ప్రభాతవార్త: సమాజంలో విలువలు పునరుద్ధరించి, ఆధ్యాత్మిక చైతన్యం పెంచేందుకు అన్నమయ్య కీర్తనలు ఎంతగానో దోహదపడతాయని పద్మావతి విశ్వవిద్యాలయం ఆచార్యులు కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. తాళ్ళపాక అన్నమాచార్యుల 520వ వర్థంతి ఉత్సవాల్లో సోమవారం అన్నమాచార్యకళామందిరంలో సాహితీ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, సప్తగిరి ఉప సంపాదకుడు డాక్టర్ నొస్సం నరసింహాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ విభీషణశర్మ పాల్గొన్నారు.

## గంగజాతర సంబరాలు ప్రారంభం



సదుం, మార్చి20 ప్రభాతవార్త : సదుంలో ఆదివారం ఉదయం నుంచి గంగజాతర సంబరాలు మొదలైనాయి. ఉదయం సదుంలోని నాలుగు వీధులలో ఉన్న గంగరాతి విగ్రహాలకు మహిళలు ప్రత్యేక అలంకరణలతో పూజలు చేశారు. చల్లపోశారు. సాయంత్రం సదుమమ్మ ఆలయంలో అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. మారుపొంగళ్లుపెట్టడం, అమ్మవారికి చీరలు పెట్టడం, కోళ్లు వంటివి ఇవ్వడం చేశారు. పాలమందలో జరిగిన జాతరలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, మాజీఎంపీపీ ఇందిరమ్మ, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డిలు తదితరులు పాల్గొని పూజలు చేశారు.సిలింకూరి యల్లమ్మ తల్లి ఆలయం వద్ద ఉదయం మహిళలు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సదుం ఎస్పైమారుతి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న గంగజాతరలకు బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. జాతర సందర్భంగా మహిళలతో అమర్యాదగా ప్రవర్తించడం వంటి పనులు చేయరాదన్నారు.

## పుత్తూరులో విద్యార్థుల ర్యాలీ

పుత్తూరురూరల్, మార్చి 20 ప్రభాతవార్త: పోషక పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో పద్మజ పాల్గొని మాట్లాడుతూ చిరు ధాన్యాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి కావలసిన పోషకాలు పుష్కలంగా అందుతాయని తెలిపారు. పోషణ పక్వాడలో భాగంగా స్వయం సహాయ సంఘాల సభ్యులు, రిసోర్స్‌పర్సన్‌లు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్‌కి పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కలిగించడం జరిగిందన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారం చేపట్టారు.

## చిత్తూరులో కీచక టీచర్

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: జిల్లా కేంద్రం చిత్తూరు పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పాఠశాలలోని ఓ బాలికపై కీచకుడిలా ప్రవర్తించాడు. ఆలస్యంగా ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ఈ వ్యవహారంను సర్దుబాటు చేసినట్లు తెలిసింది. తమ పిల్ల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొన్న బాలిక తల్లిదండ్రులు సైలెంట్ అయినట్లు తెలిసింది. అయితే ఈ విషయం బయటికి పొక్కడంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో గోప్యంగా విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం.


### ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే: డిఇఓ విజయేంద్రరావు

పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఉపాధ్యాయుడు కీచకుడిలా ప్రవర్తించాడని వచ్చిన ఫిర్యాదులు వాస్తవమేనని డిఇఓ విజయేంద్రరావు పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ఈ విషయంపై తాము విచారణ చేస్తున్నామని పూర్తి విచారణ అనంతరం ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు.

## నాణ్యమైన యాజమాన్యపద్ధతులతో పురుగు ఉధృతి నివారణ

చంద్రగిరి, మార్చి 20 ప్రభాతవార్త: నాణ్యమైన యాజమాన్య పద్ధతులు పాటించి పురుగు ఉధృతిని నివారించవచ్చని ఉద్యానవన శాఖ మండల అధికారి ఎస్.శైలజ అన్నారు. చంద్రగిరి, పాకాల మండలాలలోని పలు గ్రామాలలో సోమవారం ఆమె మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మామిడికాయల బఠానీ గింజ, ఉసిరికాయ, నిమ్మకాయ పరిమాణంలో వున్నట్లు తెలిపారు. ఈ దశలో పిందెలపై తామర పురుగు, తేనెమంచు పురుగు వ్యాప్తి ఎక్కువగా వుంటుందన్నారు. మామిడి కొమ్మ కత్తిరింపుల సకాలంలో చేసుకోవాలన్నారు.

## పిఇఎస్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త :

కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు మెడికల్ సూపరింటిండెంట్ డా।। చెన్నబసవ పాటిల్ తెలిపారు. కడపజిల్లా సుండుపల్లికి చెందిన భూక్యా సోములమ్మ అనే మహిళ గత ఇరవై ఏళ్లుగా కుడిచెంపపై ప్లియో మార్ఫిక్ అడినోమా అనే గడ్డతో బాధపడేదన్నారు. ఇటీవల చిత్తూరు పిఇఎస్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు ఈమె రాగా అక్కడ వైద్య పరీక్షలు జరిపి శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. చెంపభాగంలో ఉన్న సుమారు 1కిలో గడ్డను శస్త్ర చికిత్స ద్వారా డా।। గురురాఘవేంద్ర నేతృత్వంలో విజయవంతంగా తొలగించడం జరిగిందన్నారు. ఆమె ఆరోగ్యంగా ఉందని పేర్కొన్నారు.